తాగునీటి కుండీ పరిశుభ్రం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ పరిధి దిగువశోభ గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. పదేళ్ల క్రితం నిర్మించిన చిన్న పాటి కుండిలో బురద చేరడంతో ఆ గ్రామానికి చెందిన యువకులు తాగునీటి సరఫరా చేసేందుకు శనివారం పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా యువకులు రాజు, ప్రదీప్, సంతోష్, లు మాట్లాడుతూ, తమ గ్రామానికి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. తామే ముందుకు వచ్చి బురద చేరిన కుండిని శుభ్రపరిచి తాగునీటి సరఫరాకు శుభ్ర పరిచామన్నారు. తమ గ్రామంలో 40 కుటుంబాలు పైగా నివసిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి పైప్ లైన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

శుభ్ర పరుస్తున్న యువకులు

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి పాడేరు: ఏజెన్సీలో రహదారులు, తాగునీటి సమస్యలు, విద్యా సంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. ఎస్. జవహర్ రెడ్డి స్పష్టం చేసారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాతా శిశు మరణాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు.

అల్లూరి సీతా రామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ, రీ సర్వే, అటవీ హక్కుపత్రాలు పంపిణీ, గృహ నిర్మాణాలు, జల్ జీవన మిషన్లో చేపట్టిన తాగునీటి పథకాల నిర్మాణాలు, ఐసిడిఎస్ సేవలు, వ్యవసాయ, ఉద్యాన వన శాఖలు, కాఫీ తోటలు పెంపకం, మనబడి నాడు నేడులో పాఠశాలలకు మౌలిక సదుపాయాలు, , కీటక జనిత వ్యాధుల నివారణ చర్యలు, సికిల్సెల్ ఎనిమియా పరీక్షలు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

మెడికల్ కళాశాల నమూనాను పరిశీలిస్తున్న జవహర్‌రెడ్డి

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, జిల్లాలో ఆపరేషన్ పరివర్తన్ కింద గంజాయి నిర్మూలనకు చేపట్టిన చర్యలను వివరించారు. గంజాయి సాగు స్థానంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు, ఉద్యానవన మొక్కలు పంపిణీ చేసామని చెప్పారు. ముందుగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సమావేశం అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో సి ఎస్ మొక్కలు నాటారు. వైద్య కళాశాల నిర్మాణపు పనులు పరిశీలించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, పాడేరు ఐటిడిఏ పిఒ వి. అభిషేక్ రంప చోడవరం పిఒ సూరజ్ గనోరే, సీతంపేట పిఒ కల్పనా కుమారి, పార్వతీపురం పిఒ సి.విష్ణు చరణ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

జిసిసి బంక్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని ఎర్రంపేట కేంద్రంగా నడుపుతున్న జిసిసి బంకులో పనిచేస్తున్న గన్ బాయ్స్‌కు పెండింగులో ఉన్న యూనిఫారమ్స్ పంపిణీ చేయాలని, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం ఎర్రంపేట జిసిసి బంకు కార్మికులు 12 మంది సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కార్మికులు బంకు ద్వారా జిసిసికి మంచి ఆదాయాన్ని తెచ్చి పెడుతున్నారని, అటువంటి వారికి కనీస సౌకర్యాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రమాదకర ప్రాంతంలో పనిచేస్తున్న వారికి కనీసం ప్రమాద బీమా సౌకర్యం కూడా కల్పించడం లేదని, ఈఎస్ఐ అమలు లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పై సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, సహాయ కార్యదర్శి కారం సుబ్బారావు, కార్మికులు సింగరాజు, సోమరాజు, లక్ష్మణ్, రమేష్, రాజశేఖర్, మనోహర్, నాగిరెడ్డి, కొండబాబు, ఆదినారాయణ, రాజేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు తీరు అభ్యంతరకరం : సిపిఎం

ప్రజాశక్తి-ఎటపాక, రాజవొమ్మంగి : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పోలీసులు అరెస్టు చేసిన తీరు అభ్యంతరకరం, అప్రజాస్వామ్యం, అనైతికమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు శనివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం, మరి కొంతమందిని గృహ నిర్బంధంలో ఉంచడం సరికాదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వ ఆలోచనలు ఉండాలని, ప్రతిపక్ష నాయకులను భయభ్రాంతులకు గురి చేసినంతమాత్రాన సమస్యలు పరిష్కారం కావని తెలిపారు.

విఆర్.పురం : చంద్రబాబును పోలీసులు అరెస్టు చేసిన తీరును సిపిఎం మండల నాయకులు తీవ్రంగా ఖండించారు. రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కక్షపూరిత చర్యలు మానుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, ఎంపీపీ కారం లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని పాల్గొన్నారు.

పాడేరు : చంద్రబాబును అరెస్టు చేసిన తీరును సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తీవ్రంగా ఖండించారు. చంద్రబాబును తక్షణమే విడిచిపెట్టి స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాతంగా, చట్టబద్ధంగా విచారణ జరపాలని సిపిఎం డిమాండ్ చేస్తోందని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆందోళనకు దిగిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను రాష్ట్రవ్యాపితంగా గృహ నిర్బంధం చేయడం, ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం, ఆయన కుమారుడు లోకేష్‌ను అనుమతించక పోవడం అప్రజాస్వామికమన్నారు.

అంధుల అంతర్జాతీయ క్రికెటర్

రవణికి ఘన స్వాగతం

పాడేరులో స్వాగతం పలుకుతున్న యువకులు

పాడేరులో జరిగిన ర్యాలీలో అంతర్జాతీయ క్రికెటర్ రవణి

ప్రజాశక్తి-పాడేరు: ఇటీవల లండన్ లో జరిగిన అందుల క్రికెట్లో ఆల్ రౌండ్ ప్రతిభ కనపరిచిన పాడేరు ఏజెన్సీ హుకుంపేట మండలం రంగసింగి పాడు గ్రామానికి చెందిన రవణికి శనివారం మధ్యాహ్నం పాడేరులో ఘన స్వాగతం లభించింది. ఇటీవల క్రికెట్ పోటీలు ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన రవణి తన స్వగ్రామమైన రంగసింగిపాడుకు శనివారం వచ్చింది. ఈ సందర్భంగా ఆమెకు హుకుంపేట మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, కుటుంబీకులు, సన్నిహితులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. పాడేరులోని చెక్ పోస్ట్ నుంచి ప్రత్యేక వాహనంపై ఆమెను ఊరేగిస్తూ బైక్ ర్యాలీగా ఆమెను స్వగ్రామానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు అభినందనలు తెలుపుతూ హర్షం ప్రకటించారు.. భారత జాతీయ జెండాలను పట్టుకొని బైక్‌లపై క్రీడాకారులు, యువకులు తోపాటు రవణి బంధువులు పలువురు ప్రజాప్రతినిధులు ఈ ర్యాలీ నిర్వహించారు.

పలువురు సన్మానం

అరకులోయ: అంధుల ప్రపంచ క్రికెట్లో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఆదివాసీ ముద్దు బిడ్డ వలసనైని రవణికి హుకుంపేటలో అరకులోయ మండల విద్యాశాఖ అధికారి వి.త్రినాధ రావు సన్మానించారు. పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల ఇంగ్లండ్ లో జరిగిన అంధుల క్రికెట్ ప్రపంచ కప్ లో భారత్ కప్ గర్వకారణం అన్నారు. అరకులోయ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అరకు వైఎస్సార్సీపీ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు మాజీ సర్పంచ్ పాంగి చిన్నరావు, మాజీ జెడ్పీటీసీ కొర్రా కాసులమ్మ, మాజీ ఎంపిటిసి సమర్డి భాస్కరరావు, అరకులోయ, మాజీ సర్పంచులు గుడివాడ ప్రకాశరావు, పొట్టంగి రాంప్రసాద్, గొల్లోరి ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ పల్టాసింగి విజయ్ కుమార్, స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ అసిస్టెంట్ వంతాల అరుణ్ కుమార్ తో పాటు, వైఎస్సార్సీపీ నాయకులు పట్టాసి కొండలరావు, వంతాల గురునాయుడు, వెంకట్, సుబ్రయ్య, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: క్రికెటర్ వలసనైని రవణి మండలానికి రావడంతో మండల కేంద్రం నుంచి రంగసింగ పాడు వరకు బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలు గిరిజన సంప్రదాయం ప్రకారం హారతిచ్చి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ శతక బుల్లి బాబు మాట్లాడుతూ, అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదగటం ఎంతో గర్వ కారణం ఆయన కొనియాడారు. రవణిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న యువతీ యువకులు క్రీడారంగంలో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రమణకి న్యాయం జరిగేటట్లు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం జడ్పీటీసీ దీసారి గంగరాజు మాట్లాడుతూ, రవణి ఎన్నో ఆవాంతరాలను దాటుకొని ఇంగ్లాండ్ లో జరిగిన ప్రపంచ ఆంధుల క్రికెట్‌లో రాణించిందని కొనియాడారు. రవిణిని ప్రధాని నరేంద్ర మోడీ కనీసం గుర్తించక పోవడం బాధాకరమన్నారు. ఎంతో మంది క్రీడాకారులను ప్రభుత్వాలు గుర్తించి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాయని తెలిపారు. ప్రపంచ స్థాయిలో రాణించిన రవణిని ఆ స్థాయిలో గుర్తించక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుడిపల్లి కొండలరావు, సిపిఎం మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణరావు, గిరిజన సంఘం కార్యదర్శి తాపుల.కృష్ణారావు, జిసిసి ఎండి రామూర్తి, సర్పంచ్ దూసూరు పద్మ కుమారి, ఎంపీటీసీ నైని రజిని, నాయకులు వెంకట్రావు, సత్తిబాబు, హుకుంపేట సర్పంచ్ సమిడ.వెంకటపూర్ణిమ్మ, కొట్నపల్లి ఎంపిటిసి సాంబే బాలకృష్ణ, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో గంగరాజు, నేతల సన్మానం

రోడ్డుపైకి ప్రవహిస్తున్న మురుగునీరు

రోడ్డుపైకి మురుగునీరు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలలోని పద్మాపురం మేజర్ పంచాయితీ కేంద్రంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారింది. ఉషోదయ లాడ్జి వెళ్ళే దారిలో డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో మురుగునీరు చెత్తాచెదారంతో రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో, రోడ్డంతా మురుగునీటితో నిండి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ రోడ్డుపై వెళుతున్న స్థానికులు, పద్మావతి గార్డెన్ చూడనికి వెళ్ళే పర్యాటకులు ముక్కు ముసుకుని వెళ్ళవసిన పరిస్థితి వస్తుది. డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు ఎక్కడిక్కడ నిలిచి పోవడంతో దుర్వాసనతో పాటు దోమలు బెడద ఎక్కువైందని రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొన్నారు. దోమలతో నిద్ర పట్టలేదని తెలిపారు. అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో డ్రైనేజ్ వ్యవస్థ నిర్మాణం చేసి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, యువకులు కోరుతున్నారు.

నిలిచిన మురుగునీరు

సాగు రైతుకే భూమి కేటాయించాలి

ప్రజాశక్తి -అనంతగిరి: ఏళ్ల క్రితం నుండి సాగులోనున్న రైతుకు భూమి కేటాయించాలని కొత్తూరు పంచాయతీ సర్పంచ్ సారా. సీతయ్య డిమాండ్ చేశారు. ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ, తుమ్మలవలస గ్రామానికి చెందిన సోమ్మెల బీమా అనే రైతు సర్వే నెంబర్ 17లో మూడెకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నాడన్నారు. రెవెన్యూ అధికారులు రైతుకు తెలియపరచకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం సరికాదని తెలిపారు. స్థానిక నాయకులు, కొంతమంది భూ స్వాములతో కుమ్మక్కై రెవెన్యూ అధికారులతో చేతులు కలిపి కాజేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. రైతు సాగులో ఉన్న భూమిని ఎలాగైనా లాక్కోవాలని ప్రయత్నాలు చేస్తే చూస్తూ ఊరుకు నేన్నారు. రెవెన్యూ అధికారులు సాగు హక్కు పత్రం ఇచ్చేవరకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

చంద్రబాబు అరెస్టుపై నిరసనలు

పలుచోట్ల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధం

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

స్కిల్ డెవలప్‌మెంట్ పథకంలో ప్రభుత్వ నిధులను షెల్ కంపెనీలకు మళ్లించి మోసాలకు పాల్పడ్డారన్న అభియోగాలపై టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అరెస్టు చేయడంపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు, రాస్తారోకోలు చేపట్టారు.

నిరసన కార్యక్రమానికి వెళ్తున్న పాడేరు మాజీ ఎమ్మెల్యే ఈశ్వరిని అడ్డుకున్న పోలీసులు

పాడేరు : పాడేరు నియోజకవర్గ కేంద్రంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి శనివారం నిరసన చేపట్టేందుకు సిద్ధం కాగా, ఆమెతో పాటు పలువురు కార్యకర్తలను పాడేరు పోలీసులు ఆమె ఇంటి సమీపంలోనే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పాడేరు నియోజకవర్గం లో ఎక్కడికక్కడ గ్రామస్థాయిలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తో పాటు పలువురు దేశం నాయకులు తీవ్రంగా ఖండించారు. పాడేరులో పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో పాడేరు వైస్ ఎంపీపీ గంగ పూజారి శివకుమార్, కిలో రమేష్ నాయుడు పలువురు మండల నాయకులు ఉన్నారు.

అరకులోయ రూరల్ : తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా శనివారం అరకులోయ తెలుగుదేశం శ్రేణులు అరకులోయలో నాలుగు ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. అరకులోయ మండల కేంద్రంలో వాణిజ్య సముదాయాలు, బస్ రాకపోకలు ఆగిపోయాయి. రోడ్డుపై బైఠాయించిన పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు తో సహా తెలుగుదేశం పార్టీ శ్రేణులు నీరస కుమారి, బూర్జా లక్ష్మీ, పాడి చందు, ఇచ్ఛావతి, లక్ష్మి, దామోదర్, సోమరాజు, లక్ష్మణరావు, ప్రసాద్, రాము నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసు బాబు మాట్లాడుతూ, దుర్మార్గంగా చంద్రబాబు ను అరెస్ట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షం లేకుండా చేయడమే జగన్మోహన్ రెడ్డి ప్రధాన లక్ష్యమని ఆయన విమర్శించారు.

జి.మాడుగుల : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా స్థానిక ఎస్సై శ్రీనివాస్ గృహ నిర్బంధనం చేశారు. మరికొంతమందిని స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించారు. పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు

ముంచింగిపుట్టు : వారపు సంతలో జగన్ దిష్టిబొమ్మను టిడిపి నాయకులు దగ్ధం చేసి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద నినాదాలు చేశారు. మండల టిడిపి అధ్యక్షుడు కిల్లో బలరాం, అరకు పార్లమెంటరీ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యుడు బాబులను పోలీసులు అరెస్టు చేశారు.

దుంబ్రిగుడ : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకుగాను స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు ఏర్పాటు చేశారు. అరెస్ట్ ను నిరసిస్తూ మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టడానికి ప్రయత్నించారు. మండల కేంద్రంలో అడుగడుగునా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు కించుమండలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు బందోబస్తు నిర్వహించి, వాహనాలను తనిఖీలు నిర్వహించారు.

అనంతగిరి : మండల కేంద్రంలో టిడిపి నేతలు ఆందోళన చేపట్టారు. ఆ పార్టీ జిల్లా వైస్ చైర్ పర్సన్ కె.అప్పరావు, మండల అధ్యక్షులు టి.బుజ్జిబాబులు మాట్లాడుతూ, ముందస్తు సమాచారం ఇవ్వకుండా అక్రమ అరెస్టు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.జోగులు, ఎస్ దొన్ను, లక్ష్మణ్, ఆనంద్ పాల్గొన్నారు

చింతూరు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా చింతూరు మండలం శెట్టి జాతీయ రహదారి వద్ద టిడిపి కార్యకర్తలు నిరసన చేపట్టారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో టిడిపి మండల నాయకులు ఇల్లా చిన్నారెడ్డి, ఓబిలినేని రామారావు చౌదరి, శీలం తమ్మయ్య, పొదిలి రామారావు, సల్మాన్ రాజు, కట్ట శంకర్ ఎండి.రియాజ్ ఉన్నారు.

విఆర్.పురం : మండల కేంద్రం రేఖపల్లి ప్రధాన కూడలిలో టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు. దీంతో పోలీసులు నిరసనకారులను చెదరగొట్టి నాయకులను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసు స్టేషన్‌లో ఆందోళనకారులు నిరసన తెలిపారు. అరెస్టయిన వారిలో ఎంపిటిసి వాళ్ళ వెంకటేశ్వరరెడ్డి, టిడిపి నేతలు బురక కన్నారావు, మల్లికార్జున్‌రావు, సవలం రాజేంద్రప్రసాద్, అచ్చిరాజు, ముత్యాల చంద్రశేఖర్, సుదర్శన్‌రావు, బురక సారయ్య, కారం శర్మయ్య, సింహాచలం, దుర్గారావు, వెంకన్న, ముత్యాల పోషి, కోట్ల వాసు, పెట్ట రఘు, నాలరపు సత్యనారాయణ ఉన్నారు.

టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్, జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, నాయకులు బొర్రా నరేష్, బీరక సూర్య ప్రకాష్‌రావు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ముప్పన డింబకేశ్వరరావు, ముప్పన మోహన్, సావిత్రి, జెట్టి మధు, రాజవొమ్మంగి సర్పంచ్ జి రమణి పాల్గొన్నారు.

విఆర్.పురం పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి నేతలు

పోలీసులను ప్రశ్నిస్తున్న రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఎటువంటి నిరసనలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. టిడిపి రాజవొమ్మంగి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, కార్యదర్శి ముప్పన డింబ కేశవ్, దంతులూరి శివరామచంద్రరాజు తదితరులను శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు.

రంపచోడవరం : చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి తన ఇంటి బయట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులకు పాల్పడటం దారుణమన్నారు. తక్షణమే చంద్రబాబును విడుదల చేయాలని రాజేశ్వరి డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యేలు చిన్నంబాబు రమేష్, సీతంశెట్టి వెంకటేశ్వరరావులను హౌస్ అరెస్టు చేశారు.

ఎటపాక : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఎటపాక, తోటపల్లి నెల్లిపాక ప్రధాన రహదారిపై టిడిపి కార్యకర్తలు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయుకలు మువ్వ శ్రీనివాస్, పుట్టి రమేష్, కిలారి వెంకన్న, ఎన్.సూర్యనారాయణ, బాచినేని మల్లేశ్వరరావు, వల్లభనేని చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేషు కుమార్‌తో పాటు ముఖ్య నాయకులను పోలీసులు శనివారం ఉదయం నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు.

చంద్రబాబు అక్రమ అరెస్టును టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పల్లాల రాజ్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు అరెస్టు వైసిపి పతనానికి నాంది అని పేర్కొన్నారు. కక్షపూరిత రాజకీయాలు మానుకోపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కొయ్యూరు : టిడిపి నేతలు ఎంవివి.ప్రసాద్, తోట దొరబాబు, మాజీ ఎంపీపీ గొలుసుంగి సత్యనారాయణ, శ్రీనుబాబు, గురురామ్మూర్తి తదితరులను శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు.

పోలీసు బందోబస్తు

అడ్డతీగల : చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఎటువంటి నిరసన కార్యక్రమాలు జరగకుండా రంపచోడవరం ఎఎస్‌పి ఆధ్వర్యంలో అడ్డతీగల సీఐ రాంబాబు, ఎస్ఐ అప్పలరాజు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం నుండి ఆర్టీసీ బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. ఏలేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు మధ్యాహ్నం రెండు గంటల నుండి యథావిధిగా తిరిగాయి.

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి సిఐ షేక్ బాజీలాల్ పర్యవేక్షణలో, ఎస్ఐ టీజీ నరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు రాజవొమ్మంగిలో భారీగా మోహరించారు. ఆందోళన అడ్డుకునేందుకు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.

కొయ్యూరు : సిఐ స్వామినాయుడు, ఎస్సై రాజారావు పర్యవేక్షణలో కొయ్యూరులో భారీగా పోలీసులు మోహరించారు. ఆందోళనను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు

ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి -పెదబయలు రూరల్: స్కిల్ డెవలప్మెంట్ పేరిట స్కాం జరిగినట్లు సిఐడి నిర్ధారణ చేసి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు చేశారని అరకు శాసన సభ్యులు చెట్టి ఫాల్గుణ తెలిపారు. శనివారం పెదబయలు మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, చట్టం ఎవరికి చుట్టం కాదని తప్పు చేసిన ఎవరికైనా శిక్ష తప్పదన్నారు. చండుబాబు హయాంలో ప్రజాధనాన్ని దుర్వియోగం చేశారని విమర్శించారు. ఆ స్కాంలో రూ.371 కోట్ల అవినీతి జరిగిందన్నారు. దోచేసిన సొమ్మును విదేశాలకు, అక్కడ నుంచి తిరిగి దేశంలోకి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదబయలు ఎస్ఆర్ మండల అధ్యక్షులు ఆనందరావు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె,సూర్యనారాయణ, సీనియర్ నాయకులు గంపరాయి సూరయ్య, కొమ్మ బాలరాజు, అనంతరావు, కొర్ర కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై ఖండనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు తగదని పలువురు నేతలు ఖండించారు.

గాజువాక : చంద్రబాబును అరెస్ట్ చేసిన విధానం సరిగ్గా లేదని కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ అధ్యక్షులు జె.ముత్యాలు పేర్కొన్నారు. ఎవరిపైనైనా ఆరోపణలు వస్తే వారిని అదుపులోకి తీసుకొనేటప్పుడు న్యాయపరంగా కొన్ని నియమాలు పాటించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడుగా చంద్రబాబుపై పోలీసులు వ్యహరించిన తీరు సరిగా లేదన్నారు. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యగా ఉందని తెలిపారు.

చంద్రబాబును అరెస్టను సిబిఎన్ మిత్రమండలి సభ్యులు టి హర్షవర్ధన్, పాండురంగ జయరాజు ఖండించారు. చంద్రబాబు సభలకు ప్రజాధరణను చూసి ఓర్వలేక ఇటువంటి చర్యలకు వైసిపి ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు.

సీతమ్మధార : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తోందని జనసేన పిఎసి సభ్యుడు కోన తాతారావు ఆరోపించారు. పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రశ్నించే వారిపై అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం తప్ప గడిచిన నాలుగున్నరేళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఉషాకిరణ్, కెఎస్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు ఆలయాల్లో వారసత్వపు హక్కు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు వారసత్వపు హక్కును కల్పిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. శనివారం స్థానిక దేవాదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర జిల్లాల అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్చకులు పూర్తి వివరాలను 38, 43 రిజిస్టర్లులో నమోదు చేయాలన్నారు. అర్చకులకు వంశపారంపర్య హక్కు కల్పించినందున ఆయా రిజిస్టర్లలో పూర్వాపరాలు అవసరమన్నారు. రూ.5 లక్షలలోపు ఆదాయం ఉన్న ఆలయాల నిర్వహణకు సంబంధించిన దరఖాస్తులు కమిషనర్‌కు పంపాలని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి స్కీం కింద బిసి, ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో నిర్మిస్తున్న ఆలయాల పనులను పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి ఆలయానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కామన్ గుడ్ ఫండ్ కింద చేపడుతున్న అభివృద్ధి పనుల విషయమై జాప్యం ఉండరాదన్నారు. ఆలయాలు, సత్రాల ఆస్తుల లీజులకు సంబంధించి నిబంధనలను పాటించాలని, 11 ఏళ్ల లీజుకు ఇస్తే కచ్చితంగా పేపర్ నోటిఫికేషన్ ఇవ్వాలని అన్నారు. ఆలయాలు, సత్రాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని, ధూప దీప నైవేద్యం స్కీమును పక్కగా అమలు చేయాలని అన్నారు. సమావేశంలో దేవాదాయ ధర్మదాయ శాఖ ప్రాంతీయ కమిషనర్ సురేష్ బాబు, ఉప కమిషనర్ ఎన్.సుజాత, సహాయ కమిషనర్లు కె.శిరీష, చంద్రశేఖర్, అన్నపూర్ణ, డివివి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా గరికపాటి వర్ధంతి

రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సిఐటియు నాయకులు

ఉక్కునగరం : ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతిని నిర్వహించారు. ప్రజానాట్యమండలి సభ్యులు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా అధ్యక్షులు గుర్రం రమణ, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం మాట్లాడుతూ, ప్రజలకు సందేశాన్ని అందించడానికి మాటల కంటే పాటలు గొప్పవన్నారు. సున్నితంగా స్పష్టంగా ప్రజల గుండెలను తాకుతాయని పేర్కొన్నారు. సమాజంలో మార్పు కోసం కళాకారులు కలిసి గట్టిగా పని చేయాలని కోరారు. కృష్ణార్జున అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె.సత్యనారాయణ, జి.సత్యనారాయణ, వరకుమార్, కె.శ్రీనివాస్, నాగలింగం, భాస్కర్, సింహాచలం, శంకరరెడ్డి సువర్ణరాజు, ఇతర కళాకారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ములగాడ, ఉక్కునగరం : ప్రజా నాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతిని వెంకన్నపాలెం సిఐటియు కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రాజారావు చిత్రపటానికి సిఐటియు నేత కె.పెంటారావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి మల్కాపురం జోన్ గౌరవాధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, వైద్య వృత్తి మాత్రమే కాకుండా అనేక నాటకాలను ప్రదర్శించి ప్రజలను చైతన్యం చేసేవారని కొనియాడారు. రాజారావు ఆశయ సాధనలో నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారులు డి.రాము, బి.సూరిబాబు, బి.రాంబాబు, కె.రమణ, రాజు, సిఐటియు నాయకులు పి.పైడిరాజు, జి.నరేష్, ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

ఆదర్శవంతుడు గరికపాటి రాజారావు

స్టీల్ సిఐటియు కార్యాలయంలో....

లోక్ అదాలత్‌లో 12,556 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ లీగల్ : విశాఖ జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 12,556 కేసులు పరిష్కారమయ్యాయి. విశాఖ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజీమార్గమే రాజమార్గమన్నారు. సమన్యాయం, శాశ్వత పరిష్కారం న్యాయ సేవ ప్రాధికార సంస్థ ద్వారా లభిస్తుందన్నారు. ఇరుపక్షాలు సంపూర్ణ ఫలాలను పొందడానికి ఈ అదాలత్ పనిచేస్తోందని తెలిపారు. బ్యాంకులు, బీమా సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, కార్మిక సమస్యలు, విడాకులకు సంబంధంలేని కుటుంబ న్యాయస్థానం కేసులు రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. రెండవ అదనపు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ మాట్లాడుతూ, సత్వర, శాశ్వత న్యాయం పొందడానికి న్యాయ సేవ ప్రాధికార సంస్థ చక్కని మార్గం అన్నారు. న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ మాట్లాడుతూ, కేసుల రాజీకి ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా 39 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం వరకు 12,556 కేసులు రాజీ అయినట్లు చెప్పారు.

జాతీయ లోక్ అదాలత్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

గాజువాకలో...

గాజువాక : గాజువాక కోర్టు ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీవిద్య, థర్డ్ ఎసిఎంఎం జడ్జి రాజేంద్రబాబు, 8వ ఎసిఎంఎం జడ్జి వై.శ్రీలక్ష్మి, జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత ఆధ్వర్యాన జాతీయ మెగా లోక్‌అదాలత్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ శ్రీవిద్య మాట్లాడుతూ, రాజీ మార్గమే రాజ మార్గమని, అందరూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెవి.స్వామి మాట్లాడుతూ, లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవడం ద్వారా కాలం, ధనం, సమయం వృథా కాకుండా ఉంటాయని తెలిపారు. పలు కేసులలో కక్షిదారులు హాజరై వందల సంఖ్యలో పరిష్కరించుకున్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి చినముసిడివాడ వద్ద ఆటో బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం... పురుషోత్తపురం ప్రాంతానికి చెందిన సురేష్, సంతోష్, వాసు, కృష్ణ అప్పన్నపాలెంలో బార్‌లో మద్యం తాగారు. భోజనం కోసం పెందుర్తి వెళ్తుండగా చినముసిడివాడ వద్ద ఆటో బోల్తా పడింది. ఆటో నడుపుతున్న కృష్ణపై ఆటో పడడంతో తలకు తీవ్ర గాయమైంది. చెవిలో నుంచి రక్తస్రావమైంది. వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కెజిహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

'ఆర్ఇసిఎస్‌ను దోచుకున్న అమర్‌నాథ్'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అనకాపల్లి నియోజకవర్గంలోని ఆర్ఇసిఎస్ సంస్థను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సంస్థ మాజీ చైర్మన్, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ కలిసి రూ.100 కోట్ల మేర దోచుకున్నారని జనసేన చోడవరం నియోజవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు ఆరోపించారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా అనకాపల్లి ప్రాంత గ్రామాల్లో విద్యుత్ సేవలు అందిస్తూ ఆర్ఇసిఎస్ మంచి పేరు తెచ్చుకుందన్నారు. గుడివాడ అమర్‌నాథ్ అనకాపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత బొడ్డేడ ప్రసాద్‌తో చేతులు కలిపి పలు అక్రమాలకు తెర తీశారన్నారు. సెల్ కంపెనీల మాదిరిగా తప్పుడు సంస్థలను ఏర్పాటు చేసి వాటి ద్వారా సంస్థకు అవసరమైన విద్యుత్తు పరికరాలను కొనుగోలు చేశారన్నారు. అలా కొనుగోలు చేసిన వాటిలో నాణ్యత కొరవడిందని తెలిపారు. కొన్నింటికి దొంగ బిల్లులు సృష్టించి సంస్థ డబ్బును స్వాహా చేశారని ఆరోపించారు. ఉద్యోగ నియామకాల్లోనూ అవినీతి చోటుచేసుకుందన్నారు. ఈ అవినీతి వ్యవహారాన్ని గమనించిన అధికార పార్టీకి చెందిన అనకాపల్లి ఎంపీ, చోడవరం, గాజువాక, యలమంచిలి ఎమ్మెల్యేలు ఆర్ఇసిఎస్‌ను రద్దుచేసి ఎపిఇపిడిసిఎల్‌లో విలీనం చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశారని చెప్పారు. దీని ఆధారంగా ఆర్ఇసిఎస్‌ను రద్దుచేసి ఎపిఇపిడిసిఎల్‌లో విలీనం చేశారన్నారు. ఇది జరిగిన ఏడాదిలోనే రూ.155 కోట్లు లాభం సంస్థకు వచ్చిందన్నారు. బొడ్డేడ ప్రసాద్ సంస్థ చైర్మన్‌గా ఉండగా సంస్థకు భారీగా నష్టాలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సమావేశంలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, ఆ పార్టీ అనకాపల్లి నాయకులు దూలం గోపి పాల్గొన్నారు.

13న లక్ష తులసి పూజ

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం కుంతీ మాధవ్ స్వామి ఆలయంలో ఈ నెల 13వ తేదీన నిర్వహించే లక్ష తులసి పూజను విజయవంతం చేయాలని ఎంపిపి రాంబాబు భక్తులను కోరారు. కుంతీ మాధవ్ స్వామి ఆలయంలో శనివారం భక్తులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఉదయం 7 గంటల నుంచి అభిషేకాలు, 9 గంటల నుంచి లక్ష తులసి పూజా కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఓ భక్తుడు ఎం.సన్నిబాబు ఆలయాన్ని పువ్వులతో అలంకరణ చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భక్తులు నారాయణరావు, ప్రసాదు, అప్పలనాయుడు, సత్యనారాయణ, జయం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఇందిరమ్మ కాలనీలో ఇటీవల మృతి చెందిన పిచ్చుకల రమణమ్మ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం రూ.10 వేలును వైస్ ఎంపిపి బొట్ట ధనలక్ష్మి ఆధ్వర్యాన అందించారు. ఈ కార్యక్రమంలో బొట్ట రామకృష్ణ, ఎంపిటిసి మాజీ సభ్యులు ఉప్పాడ సూరిబాబు, వెల్ఫేర్ సెక్రెటరీ దివ్య, వాలంటీర్ రమేష్ పాల్గొన్నారు.

అనాథలకు జెసిఐ చేయూత

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరానగర్‌లో ఉన్న ఆనంద్‌మార్గ్ అనాథ గృహానికి జెసిఐ వైజాగ్ పారామౌంట్ శనివారం వాటర్ ఫిల్టర్‌ను బహూకరించించింది. జెసిఐ డాక్టర్ విజయ్‌కుమార్ పిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆనంద్‌మార్గ్ సంస్థ సభ్యులు ఆచార్య సౌమ్యానంద అవదూత, ఆర్‌పి పాత్రో జెసిఐకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసిఐ వైజాగ్ పారామౌంట్ అధ్యక్షుడు కాకర్ల శ్రీధర్, డాక్టర్ విజయ్ కుమార్, గిరిజ పాల్గొన్నారు.

అరెస్టు సందర్భంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి గంటా

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అరెస్ట్, బెయిల్

ఎంవిపి కాలనీ : గత చంద్రబాబు ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన గంటా శ్రీనివాసరావును శనివారం ఉదయం 7 గంటలకు ఎంవిపి.కాలనీలోని ఆయన ఇంటి వద్ద పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి నుండి ఎండాడ వద్ద ఉన్న దిశా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అక్కడి నుంచి ఉదయం 11 గంటలకు మధురవాడలోని ఎసిబి కార్యాలయానికి తరలించి అక్కడ ఉంచారు. ఆయనతోపాటు అతని కుమారుడు గంటా రవితేజనూ పోలీసులు అరెస్టు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం జరిగే సమయానికి గంటా శ్రీనివాసరావు చంద్రబాబు కేబినెట్‌లో విద్యాశాఖ మంత్రి ఉన్నారని, ఆ కేసులోనే ఈ అరెస్ట్ జరిగిందని ఉదయం రాష్ట్రమంతటా ప్రచారం సాగింది. దీనిపై స్థానిక పోలీసులు వివరణ ఇస్తూ.. 'స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించిన అరెస్టులు సిఐడి పరిధిలోనే ఉంటాయి. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే గంటాను అరెస్టు చేశాం' అని మీడియాకు తెలిపారు.

గంటా, అతని కొడుకు అరెస్ట్ వెనుక?

విశాఖ పోలీసులు గంటాను, ఆయన కుమారుడు రవితేజను అరెస్టు చేయడం వెనుక వ్యూహాత్మక కారణాలే ఉన్నాయని తెలుస్తోంది. విశాఖలో మిగతా నాయకులందరినీ గృహ నిర్బంధం చేసి గంటాను మాత్రమే అరెస్టు చేయడం దీనికి ఊతమిస్తోంది. టిడిపి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రిగా గంటా కొనసాగిన కాలంలో గంటా సుబ్బారావు అనే వ్యక్తి షెల్ కంపెనీ నిర్వహించడం, అందులో గంటా కొడుకు రవితేజ పార్టనర్‌గా ఉండి స్కిల్ డవలప్‌మెంట్ కుంభకోణంలో భాగస్వామ్యం కావడం వంటి విషయాలపై పక్కా సమాచారంతోనే వీరిని అరెస్టు చేసినట్లు చర్చ జరుగుతోంది.

కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు చెల్లించండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి కాంట్రాక్టర్లు చేసిన పనుల పెండింగ్ బిల్లులను త్వరగా చెల్లించాలని జివిఎంసి మేయర్, కమిషనర్లకు జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కోరింది. శనివారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ ప్రస్తుతం చేస్తున్న పలు అభివృద్ధి పనులకుగాను రూ.150 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని కూడా త్వరగా చెల్లించాలని కోరుతున్నామన్నారు. గత నెల 29న నగరంలోని ఆశీలుమెట్ట జంక్షన్ వద్దనున్న మహారాష్ట్ర మండలిలో జరిగిన జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఎన్నికల కమిటీకి ఇచ్చిన బాధ్యత ప్రకారం నూతన కార్యవర్గ కమిటీని సీనియర్ కాంట్రాక్టర్లతో సంప్రదించి ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. నాలుగున్నర సంవత్సరాలుగా స్పెషల్ డెవలప్‌మెంట్ బిల్లుల చెల్లింపులు జరగలేదన్నారు. కోర్టుకు వెళ్లినవారికి మాత్రమే చెల్లింపులు జరిపి, కోర్టుకు వెళ్లని వారికి చెల్లింపులు జరపకపోవడం శోచనీయమన్నారు. చెల్లింపులు జరిపేటప్పుడు సరళీకృత విధానాన్ని అమలుజేయాలని కోరుతున్నామన్నారు. తమ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షునిగా రొంగలి జగన్నాథం, గౌరవాధ్యక్షునిగా వి.సత్యనారాయణ, అధ్యక్షునిగా గొంపా చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా పిఎస్.ప్రసాద్, బి.రామా నాయుడు, పి.అప్పలరాజు, జి.దేముడు, ఎం.సంజీవరెడ్డిలను ఎన్నుకున్నామన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు తాత రుత్తల లచ్చాపాత్రుడు 41వ వర్ధంతి సందర్భంగా అయ్యన్న వ్యవసాయ క్షేత్రం వద్ద నూతనంగా నిర్మించిన దేవాలయంలో లచ్చాపాత్రుడు,అయ్యన్న తండ్రి చింతకాయల వరహాలు దొర విగ్రహాలను మున్సిపాలిటీ కౌన్సిలర్స్ అయ్యన్న సతీమణి చింతకాయల పద్మావతి అయ్యన్న తనయుడు చింతకాయల రాజేష్, కుటుంబ సభ్యులు ఆవిష్కరణ చేశారు.

అంతుచిక్కని వ్యాధితో జీవాలు మృత్యువాత

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి ఎటపాక

వీలీన నాలుగు మండలాల్లో అంత చిక్కని వ్యాధితో గొర్రెలు, మేకలు మరణిస్తున్నాయి. అయినా అధికారులు తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో గొర్రెలు, మేకల పెంపకందారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎటపాక మండలం గౌరీపేట గ్రామంలో గత ఐదు రోజుల్లో ఆరు గొర్రెలు మరణించినట్లు ఆ గ్రామానికి చెందిన కాటి బోయిన నాగయ్య తెలిపారు. అదే గ్రామంలో గత రెండు నెలలుగా గొర్రెలు, మేకలు పదుల సంఖ్యలో మరణించాయని, అధికారులు దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తమ ప్రాంతంలో పశువైద్యులు సరిగా స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. చనిపోయిన జీవాలకు పోస్టుమార్టం చేస్తారని జీవాల మృతదేహాలతో రెండు రోజులు నుండి ఎదురు చూస్తున్నామని, పశువైద్య అధికారులెవరూ ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటపాకతో పాటు విఆర్.పురం, కూనవరం, చింతూరు నాలుగు మండలాల్లోనూ ఇదేవిధంగా మూగజీవాలు మరణిస్తున్నాయి. విఆర్.పురం మండలం రేఖపల్లి పంచాయతీ పరిధి గొల్లగూడెంలో కూడా పదుల సంఖ్యలో గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అయినా జీవాల మరణానికి గల కారణాలను ఇంతవరకు అధికారులు వెల్లడించలేదు. మండల పశు వైద్యులు, ప్రతి సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్లు ఉన్నా జీతాల మరణాల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పశువైద్య శాఖ ఉన్నతాధికారులు నాలుగు మండలాల్లో పర్యటించి మరణాలు గల కారణాలను తెలుసుకొని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని జీవాల పెంపకదారులు కోరుతున్నారు

మృతి చెందిన జీవం వద్ద దిగాలుగా పెంపకందారుడు

'సనాతన ధర్మం' సామాజిక న్యాయానికి విరుద్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆధునిక వ్యవస్థలో సనాతన ధర్మానికి చోటు లేదని, అది సామాజిక న్యాయానికి విరుద్ధమని, వీరేశలింగం, రాజా రామ్మోహన్ రాయ్, గురజాడ, అంబేద్కర్, పెరియార్ వంటి ఎంతోమంది మేధావులు, శాస్త్రజ్ఞులు ఈ సనాతన వాదాన్ని వ్యతిరేకించారని భారత నాస్తిక సమాజం రాష్ట్ర కన్వీనర్ టి.శ్రీరామమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కుల వ్యవస్థను కాపాడడమేకాక అగ్రకుల దురహంకారం, ఆధిపత్యాన్ని కాపాడటం, రాజ్యాంగ హక్కులను కాలరాయడం, మహిళలను అవమానించడం, హక్కులు లేకుండా చేయటం వంటి అవలక్షణాలు ఉన్న సనాతన ధర్మాన్ని మలేరియా, కరోనాల కంటే ప్రమాదకరమైన సామాజిక రుగ్మతగా గుర్తించి సనాతన ధర్మాన్ని వ్యతిరేకించండని తమిళనాడు మంత్రి ఉదయనిది స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు సమంజసమేనని తెలిపారు.

250 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏలేశ్వరం శ్రీకృష్ణ ఎముకల ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ ఎన్.ఉమామహేష్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి రూ.30 వేలు విలువైన ఉచిత మందులను అందజేశారు. ప్రతి ఒక్కరికీ రూ.2500 విలువ కలిగిన బీఎండీ ఎముకల సాంద్రత పరీక్ష ఉచితంగా చేశారు. వీరిలో ఐదుగురిని వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన వైద్యానికి రిఫర్ చేసినట్లు డాక్టర్ ఉమా మహేష్ తెలిపారు. ఈ శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది ఎల్.నాయుడు, శివాని, జయ, ఎల్టి మల్లేశ్వరరావు, గణేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లావు నాగేశ్వరరావు

న్యాయవ్యవస్థ స్వతంత్రమైనది

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ స్వతంత్రమైనదని సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఉదయం విశాఖలోని బీచ్ రోడ్డులోగల ఓ హోటల్‌లో ప్రముఖ న్యాయవాది టివిఎస్‌కె కనకరాజు రచించిన 'ట్రయల్ లాయర్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అన్ని వృత్తుల కంటే న్యాయవాద వృత్తి అత్యంత ఉత్తమమైనదని తెలిపారు. దిగువ న్యాయస్థానాల్లో వచ్చే తీర్పులు సర్వోన్నత న్యాయస్థానాలకు ఒక నిఘంటువుగా ఉంటాయని వివరించారు. ప్రముఖ న్యాయవాదిగా కనకరాజు తమ అనుభవాలను పుస్తక రూపంలో తీసుకురావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ప్రతి న్యాయవాదీ వృత్తిలో ప్రవేశించిన తొలి అడుగుల్లోనే ఈ పుస్తకాన్ని చదవడం అవసరమన్నారు. కోర్టులో కేసులు దాఖలు చేసే విధానం, న్యాయవిద్య, దిగువ న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులు వంటి అంశాలను పొందుపరిచిన తీరు న్యాయవాదులకు ఎంతో ఉపయుక్తమన్నారు. ప్రజల హక్కులను పరిరక్షించే న్యాయవాదులకు ఇటువంటి రచనలు అవసరమన్నారు. సాక్ష్యాల సేకరణ, కోర్టులో వాటిని సమర్పించే తీరు వంటి అంశాలను జూనియర్ న్యాయవాదులు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఇటీవల ప్రసార మాధ్యమాలు న్యాయమూర్తుల పట్ల చూపిస్తున్న అత్యుత్సాహం, మితిమీరిన ప్రచారం న్యాయవ్యవస్థకు గొడ్డలిపెట్టుగా తయారైందని తీవ్రంగా స్పందించారు.

విద్యుత్ వినియోగదారులపై భారాలు వద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపొద్దని వార్వా, నివాస్ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎపిఇపిడిసిఎల్ యాజమాన్యం తాను విద్యుత్ కొనుగోలు చేయడానికి ముందుగా పెట్టిన వర్కింగ్ కేపిటల్‌పై వడ్డీ రూ.420 – రూ.650 కోట్ల వరకూ వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవడానికి అనుమతి కోరుతూ ఎపిఇర్‌సికి పిటిషన్ దాఖలు చేయగా, ఎపిఇఆర్‌సి అభిప్రాయాలను తెలియజేయాలని ప్రకటించిందని, దీనిపై ఈ నెల 13న విచారణ జరుగనుందని తెలిపారు. డిస్కమ్‌లకు పవర్ కొనుగోలు చేయడానికి ముందుగా వర్కింగ్ పెట్టుబడి కేటాయించాల్సిన పరిస్థితి రావడానికి కారణం సామాన్య వినియోగదారులు కాదన్నారు. కొన్ని ఆఫీసుల వారు, పరిశ్రమల వారు విద్యుత్ బిల్లుల చెల్లింపులు ఆలస్యం చెయ్యడం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీలు సకాలంలో విడుదల చెయ్యకపోవడం వంటివి కారణాలని తెలిపారు. వీటిని సరిచేసుకొనే చర్యలు డిస్కమ్‌లు తీసుకోవాలని తెలిపారు. అంతేగాక ప్రతి వినియోగదారుడు కరెంట్ కనెక్షన్ తీసుకునేటప్పుడు చెల్లించే సెక్యూరిటీ డిపాజిట్లు వేల కోట్ల రూపాయలు డిస్కమ్‌ల వద్ద ఉన్నాయని, వీటిపై వచ్చే వడ్డీని కూడా వర్కింగ్ కేపిటల్‌గా ఉపయోగించవచ్చునని పేర్కొన్నారు. ఇప్పటికే ట్రూ అప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎల పేరిట రకరకాలుగా భారీగా వినియోగదారులపై భారాలు మోపిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఎపిఇపిడిసిఎల్ అభ్యర్థనను తిరస్కరించాలని ఎపిఇఆర్‌సిని కోరారు. ఈ విషయమై లేఖను ఇప్పటికే ఎపిఇఆర్‌సి కార్యదర్శికి పంపించామన్నారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయం శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. గరుడాద్రి పర్వతం పైన, దిగువున ఉపాలయాల్లోనూ అర్చక బృందం ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.ప్రతి శనివారం దాతల సహాయంతో నిర్వహించే అన్న సమారాధనలో సుమారుగా 1000 మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు.